## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు సన్మానం



రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని మండలంలోని జయరాం తండా(కె), బురహాన్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముకేశ్‌రెడ్డి, మోహన్, కమలాకర్‌రెడ్డి మంగళవారం శాలువాతో సన్మానించారు. తొలుత ఎమ్మెల్యేను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం కావ్య గెలుపు కోసం పని చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు అత్యధిక శాతం మంది కావ్యకు ఓటు వేసినట్లు చెప్పారు.

### డీటీడీఓ అక్రమాలపై విచారణ చేపట్టాలి

రాయపర్తి : జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) ప్రేమకళ అక్రమాలపై విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ, జనగాం జిల్లాలకు అధికారిగా వచ్చినప్పటి నుంచి ప్రేమకళ మూడేళ్లుగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నుంచి మధ్యవర్తుల ద్వారా లక్షలాది రూపాయలు దండుకుంటూ లోపాయికారిగా ఒప్పందం చేసుకుని అదనంగా మరో హాస్టల్ అప్పగిస్తోందని, ప్రశ్నించిన వారిపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. జనగాం జిల్లాలో పలువురికి రెండు చొప్పున హాస్టళ్లు అప్పగించిందని వివరించారు. అలాగే హాస్టళ్లలో ప్రతీ నెల డైట్ బిల్లుల నుంచి 20 శాతం లంచం తీసుకుంటూ విద్యార్థుల హాజరును అక్రమంగా 100 శాతం నమోదు చేయిస్తోందని తెలిపారు. డీటీడీఓ ప్రేమకళ గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టుపట్టిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే డీటీడీఓ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు.

### కమిటీ ఎన్నిక

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం తెలంగాణ ధూపదీప నైవేద్య సంఘం ఆత్మకూరు, దామెర మండలాల సంయక్త సమావేశం నిర్వహించారు. ఇందులో ఆత్మకూరు, దామెర మండలాల సంయక్త కమిటీని ఎన్నుకోవడం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలనుపాక వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా లేదాల్ల శ్రీనివాసులు, కొట్టురి సుధీర్‌కుమార్, కోశాధికారిగా ఆరుట్ల మాధవమూర్తిని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన రెండు మండలాల ధూపదీప నైవేద్య అర్చకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల మధుకర్‌శర్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వచ్చునూరి రవీందర్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు, సిద్ధాంతి గణేశ్‌కుమార్, పరకాల డివిజన్ అధ్యక్షుడు కొలనుపాక భాస్కరశాస్త్రీ, రెండు మండలాల అర్చకులు పాల్గొన్నారు.

### రేపు రథోత్సవం

వరంగల్ చౌరస్తా : భద్రకాళీ, భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈనెల 16న పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రథోత్సవం, కంకుమార్చన, మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు, నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం వరంగల్ ఆర్‌ఎస్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులతోపాటు ఇతర వర్గాల ప్రజలకు కార్యక్రమంలో పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్యక్రమ కన్వీనర్లు తోనుపునూరి వీరన్న, మల్యాల వీర మల్లయ్య, అయిత గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### సెల్వరాజ్ మృతి కార్మిక ఉద్యమాలకు లోటు

న్యూశాయంపేట : తమిళనాడులోని నాగపట్టిణం పార్లమెంట్ సభ్యుడు సెల్వరాజ్ మృతి కార్మిక, కర్షక ఉద్యమాలకు తీరనిలోటని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు అన్నారు. నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికై పార్లమెంట్‌లో రైతు, కూలీల అన్ని వర్గాల ప్రజల వాణిని వినిపించిన నిస్వార్థ ప్రజానాయకుడన్నారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

### జాతీయ సమైక్యతా శిబిరానికి 'ఎల్బీ' విద్యార్థులు

రామన్నపేట : హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి నగరంలోని లాల్‌బహదూర్ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ పదో బెటాలియన్ విద్యార్థులు 17 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంగళవారం శిబిరంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు బయలుదేరినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్స్, ఎయిర్ ఫోర్స్, నేవీ పాల్గొనే ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

# కోతల వేళ వర్షాఘాతం

**రైతన్నకు భారీ నష్టం**
- అధికారుల మాటలు బేఖాతరు
- తడిసిన ధాన్యాన్ని కొనని మిల్లర్లు



వర్షానికి నేలవాలిన వరిపంట



తడిసిన ధాన్యాన్ని కుప్ప చేసుకుంటున్న రైతులు



వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

ఖానాపురం : పంటల కోతల వేళ రైతన్నపై వర్షాఘాతం తప్పడంలేదు. ఈనెల 12 నుంచి మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు మండలవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, మనుబోతులగడ్డ, అశోక్‌నగర్, అయోధ్యనగర్, దబ్బీరుపేట, చిలుకమ్మతండా, ధర్మరావుపేట, కొత్తూరు, రంగాపురం, తదితర గ్రామాలకు చెందిన రైతులు పాకాల ఆయకట్టు కింద సుమారు 18 వేల ఎకరాల్లో యాసంగి వరి పంట సాగు చేశారు. మండలంలో సుమారు 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఖానాపురం, బుధరావుపేట, కొత్తూరు, రంగాపురం, మనుబోతులగడ్డ, అశోక్‌నగర్, అయోధ్యనగర్, దబ్బీరుపేట, ఐనపల్లి, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. ప్రస్తుతం సగానికి పైగా కోతలు పూర్తి అయ్యాయి. ఇంకా కొంత మేర పంటలు ఆయకట్టులో కోత దశలో ఉన్నాయి. కోతలు పూర్తి చేసుకున్న రైతులు రోడ్లపైనా, సబ్ మార్కెట్ యార్డులో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. మంగళవారం సాయంత్రం కూడా వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యాన్ని రాసులుగా నేర్పుకునేందుకు అష్టకష్టాలు పడ్డ దుస్థితి కళ్లకు కడుతోంది. ఎంత కష్టపడినా చాలా వరకు ధాన్యం తడిసిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్న పరిస్థితి కనపడుతోంది.

**తడిసిన ధాన్యం కోసం మిల్లర్లను బతిమిలాడాల్సిన దుస్థితి**

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటించినా మిల్లర్లను రైతులు బతిమిలాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు రైతుల ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేది లేదని మిల్లర్లు ఖరాఖండిగా చెబుతుండడంతో రైతన్న చేసేదేమీ లేక ఎంతో కొంత ధర చెల్లించి కొనుగోలు చేయండి మహాప్రభో.. అంటూ బతిమిలాడుకుంటున్న పరిస్థితి చోటు చేసుకుంటోంది.

**తడిసిన ధాన్యాన్నీ కొనాల్సిందే..**

రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాల్సిందేనని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారుల మాటను బేఖాతరు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటలు నష్టపోయిన వేదనలో రైతన్నలు కొట్టుమిట్టాడుతుండగా మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనేది లేదని తేల్చి చెబుతుండడంతో రైతులకు కన్నీరు తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖలు సత్వరమే స్పందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఖానాపురం : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. మండలంలోని ఐనపల్లిలో హరితమిత్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ×ఎ× గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2203, కామన్ రకాలకు రూ.2183 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తారని తెలిపారు. ధాన్యం కొనుగోలు తర్వాత సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) స్వప్న, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, మేరుగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆర్‌డీఎఫ్'లో వృత్తి విద్యా కోర్సులు

పర్వతగిరి : మండలంలోని కల్లెడలోని ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. ఆయన మీడియాకు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్‌ఎం (మహిళ), ఈటీ, సీఎస్‌సీ కోర్సులు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంఎల్‌టీ అభ్యసించిన విద్యార్థులు సొంతగా ల్యాబ్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి, ప్రభుత్వ, డెంటల్ కాలేజీల్లో, క్లినికల్ ల్యాబ్‌ల్లో ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్‌ఎం (మహిళ) అభ్యసించిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నర్సు ఉద్యోగం పొందవచ్చని, బీఎస్సీ నర్సింగ్ అభ్యసించవచ్చని వివరించారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9949383450, 9959301913ల్లో సంప్రదించాలని తెలిపారు.

## మండలంలో తగ్గిన పోలింగ్ శాతం

సంగెం : ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో పోలింగ్ శాతం తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 86.83 నమోదు కాగా తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 80.80 శాతమే పోలింగ్ జరిగినట్టు ఏఆర్‌ఓ, స్థానిక తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ మీడియాకు మంగళవారం వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో మొత్తం 39 వేల 996 మంది ఓటర్లుండగా వారిలో 19 వేల 996 మంది పురుషులు కాగా 20 వేల 437 మంది స్త్రీలు. ఇందులో 16 వేల 152 మంది పురుషులు, 16 వేల 165 మంది స్త్రీలు ఓటు హక్కు వినియోగించుకోగా 80.80 శాతం పోలింగ్ నమోదైంది. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలో మొత్తం 40 వేల 224 ఓటర్లు ఉండగా వారిలో 34 వేల 929 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86,83 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 80.80 శాతం మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 6.03 శాతం పోలింగ్ తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. రాజకీయ పార్టీలు సరైన రీతిలో ప్రచారం చేయకపోవడంతోపాటు గతంలో డబ్బులు పంపిణీ చేసి ఈసారి మొండి చేయి చూపారన్న కారణాలతో పోలింగ్ శాతం తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా ప్రభుత్వం, అధికారులు ఈసారి దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినా అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో పోలింగ్ శాతం తగ్గడానికి గల కారణం అంతుచిక్కడం లేదు.

**గీసుకొండలో 77.52 శాతం పోలింగ్**

గీసుకొండ : గీసుకొండ మండలంలోని రూరల్ పరిధిలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా 77.52 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 28 వేల 358 మంది ఓటర్లు ఉండగా వారిలో 10 వేల 760 మంది మహిళలు, 11 వేల 223 మంది పురుషులు ఉన్నారు. మొత్తం 21 వేల 983 మంది ఓటు వేయగా 77.52 శాతంగా నమోదైంది.

**15, 16 డివిజన్లలో ఇలా..**

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్‌లో 11 వేల 185 మంది ఓటర్లు ఉండగా 4 వేల 47 మంది మహిళలు, 4 వేల 069 మంది పురుషులు ఉన్నారు. మొత్తం 8 వేల 116 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 72.56 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే 16వ డివిజన్‌లో 11 వేల 519 మంది ఓటర్లు ఉండగా 4 వేల 176 మంది మహిళలు, 4, వేల 203 మంది పురుషులు ఉన్నారు. మొత్తం 8 వేల 378 మంది ఓటు వేయగా 72.73 శాతంగా నమోదైంది.

### ప్రసన్నాంజనేయస్వామికి పూజలు

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షికాలనీ హనుమద్గిరి శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, 51 కిలోల మార్యాడి శనిగలతో అలంకరించినట్లు అర్చకులు ఆరుట్ల రామాచారి తెలిపారు.

# శతాబ్ది ఉత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి తిమ్మరాయినిపహాడ్ గ్రామ వంద సంవత్సరాల వేడుక
- ముస్తాబైన పునీత రాయప్ప ఆలయం



తిమ్మరాయినిపహాడ్ గ్రామ వ్యూ

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామం శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. 1924లో ఆవిర్భవించిన ఈ గ్రామం వంద సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈనెల 15 నుంచి 17 వరకు జరగనున్న వేడుకలకు గ్రామంలోని పునీతరాయప్ప దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. గ్రామంలో పుట్టి దేశవిదేశాల్లో స్థిరపడిన వారు హాజరుకానున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సుమారు 3 వేల మందికి అన్నదానం ఉంటుందని విచారణ గురువు ఫాదర్ తుమ్మ యాగారెడ్డి తెలిపారు. మరణించి పెద్దల కోసం సమష్టి బలిపూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దేవమాత స్వరూపంతో ప్రదక్షిణ, రాత్రి 8.30 గంటలకు పీఠాధిపతులతో శత సంవత్సర గ్రామ ఆవిర్భావ మహోత్సవ కృతజ్ఞత బలిపూజ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన అగ్ర పీఠాధిపతి పూల ఆంథోని, వరంగల్ పీఠాధిపతి ఉడుముల బాల, నెల్లూరు పీఠాధిపతి ఎండీ ప్రకాశం, గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య, ఖమ్మం పీఠాధిపతి సిగిలి ప్రకాశ్, నల్లగొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్ హాజరవుతున్నారని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు పునీత రాయప్ప స్వరూపంతో గ్రామ పురవీధులలో ప్రదక్షిణ, ఆశీర్వాద ప్రార్థనలతో వేడుకలు ముగిస్తామని చెప్పారు. రాత్రి 8.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ప్రజలు భారీగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని విచారణ గురువు యాగారెడ్డి కోరారు.

**ఆశీర్వాదం తీసుకోవాలి**



ఊరు పుట్టి వంద సంవత్సరాలు అవుతోంది. దేవుడు అన్ని విధాలుగా ఆశీర్వాదాలతో దీవించాడు. నా ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగడం సంతోషంగా ఉంది. ఉత్సవాలకు గ్రామస్తులతోపాటు సమీప గ్రామాలకు ప్రజలు కూడా వస్తారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని పునీతుని ఆశీర్వాదం తీసుకోవాలి.

-తుమ్మ యాగారెడ్డి, విచారణ గురువు



ముస్తాబైన పునీత రాయప్ప ఆలయం

# రోడ్డు నిర్మాణానికి ఇంకెన్నాళ్లు..?



అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన కాజ్‌వే



కంకరపోసి వదిలేసిన రోడ్డు

చెన్నారావుపేట : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదన్న నానుడిని నిజం చేసేలా మండలంలోని రోడ్ల దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి 10 నెలలు గడచినా కాంట్రాక్టర్ కంకర పోసి నిర్లక్ష్యంగా వదిలేసిన పరిస్థితి కనపడుతోంది. అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇంకెన్నాళ్లకు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తారని ప్రజలు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం రూ.180 లక్షలు ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయగా మండలంలోని ఖాదర్‌పేట నుంచి కోరంకుంట తండా మీదుగా గొల్లపల్లి వరకు 2023 జూన్‌లో రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మొదలుపెట్టారు. కంకర పోసి వదిలేశారు. 10 నెలలు గడచినా తారు పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. రోడ్డు సౌకర్యం లేక అనేక ఏళ్లుగా ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. రోడ్డుపై కంకరతో ద్విచక్ర, భారీ వాహనాలు దెబ్బతింటున్నాయి. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాల బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ముగించేలా చూడాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**నరకం కనిపిస్తోంది**



కంకర పోసిన రోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తుండడంతో నరకం కనిపిస్తోంది. ప్రతీ రోజు నర్సంపేటకు హమాలీ పని కోసం పలువురు ద్విచక్ర వాహనాలపై వెళ్తారు. మేమంతా ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకుంటాం. ఈ పరిస్థితిలో కంకర రోడ్డుపై ప్రయాణం కష్టంగా మారింది. రోడ్డు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కన్నె విజేందర్, గ్రామస్తుడు

**త్వరగా పూర్తి చేయాలి**



ఖాదర్‌పేట నుంచి గొల్లపల్లి మీదుగా కోరంకుంట తండా వరకు రోడ్డు పనులకు కోసం నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ కంకర పోసి రోడ్డు పనులు వదిలేశారు. ఈ క్రమంలో మేము ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనాదారులు, విద్యార్థులు ప్రతీరోజు కంకర రోడ్డు మీదుగా తప్పనిసరిగా ప్రయాణించక తప్పదు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు పనులు జరిగేలా చూడాలి.

-బట్టమేకల సమ్మయ్య, గొల్లపల్లి గ్రామస్తుడు

**అసంపూర్తిగా కాజ్‌వే**

రోడ్డుకు మధ్య చెరువునీరు పొలాలకు వెళ్లే కాజ్‌వే వద్ద పైపులైన్ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

## వేడుకగా హనుమాన్ హోమగుండ పూజలు




పూజ చేస్తున్న రాజేందర్, భక్తులు



హోమ గుండ పూజ చేస్తున్న భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శాంతినగర్‌లో హనుమాన్ మాల ధరించిన భక్తులు మంగళవారం హోమగుండ పూజలు వేడుకగా నిర్వహించారు. పూజారి రామకృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని హనుమాన్ మాల 41 రోజుల దీక్షలో భాగంగా 28వ రోజు సందర్భంగా పట్టణంలో తొలిసారిగా హనుమాన్ సువర్చలాదేవి విగ్రహానికి పూజ చేశారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి గుర్రం వెంకన్న, అప్పాల శ్రీకాంత్, వానం భిక్షపతి, రాయపురం రాజు, పులిచేరి రమేశ్, రాయపురం ప్రవీణ్, పాలకుర్తి మధు, శ్రీరాముల రాజు, పల్లకొండ సాంబయ్య, గుర్రం పాషా, పాలకుర్తి రవి, మెరగుర్తి రమేశ్, రమావత్ నారాయణ, వేమునూరి సుధాకర్, పల్లకొండ సాంబరాజ్, అన్నం రాజు, నూనె స్వామి పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. దేవాలయ ప్రాంగణంలో మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు, కుల పెద్దలతో కలసి సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం బ్రహ్మోత్సవ కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేరుగు నరేష్‌గౌడ్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలునాయక్, ఏపూరు వెంకట్‌రెడ్డి, పింగిళి శ్రీనివాస్, శివరాత్రి సంపత్, సురేందర్, మల్లయ్య గౌడ్, వెంకటయ్య, యాకయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మండల పూజ



గూడూరు: మండలంలోని మధనాపురంలో నూతనం నిర్మించిన లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మండల పూజా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నిర్మించి 41రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం పూజారులు క్రాంతికుమార్, శ్రవణ్ వేదమంత్రోశ్చరణల నడుమ ఆలయ నిర్మాణ ధర్మకర్తలు లింగాల రాధికా సుధీర్‌రెడ్డి దంపతులు, భక్తులచే హోమం నిర్వహించారు. లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి అష్టోత్తర, నవగ్రహ పూజలు చేశారు. గోవింద నామస్మరణతో మధనాపుర గ్రామవీధులు మారుమ్రోగాయి. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.